Prajasakthi (Sunday Magazine) dt 14/04/13

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకి ప్రపంచంలోని ఉత్తమ ఇంజనీరింగ్ ప్రాజెక్టుగా గుర్తింపు లభించింది. ఫిబ్రవరి 27 నుండి మార్చి 1 వరకు న్యూయార్క్‌లో జరిగిన "ప్రపంచ మౌలిక వసతుల నాయకత్వ సమావేశం" (గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీడర్‌షిప్ ఫోరం) రూ.14,132 కోట్ల హైదరాబాద్ మెట్రో రైలును "ఈ సంవత్సరపు ఉత్తమ ఇంజనీరింగ్ ప్రాజెక్టు" (గ్లోబల్ ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ ఆఫ్ ది ఇయర్ -2013)గా గుర్తించింది. ఈ ఫోరంను ఆరు సంవత్సరాల క్రితం స్థాపించారు. దీని వార్షిక సమావేశం ప్రపంచంలోని ఏదో ఒక దేశంలో ఏటా మూడు రోజుల పాటు జరుగుతుంది.



అవార్డు అందుకుంటున్న ఎన్.వి.ఎస్.రెడ్డి

# మన మెట్రో రైలు

## ప్రపంచ ఉత్తమ ఇంజనీరింగ్ ప్రాజెక్టు

వివిధ దేశాలలో నిర్మించబడుతున్న మౌలిక వసతుల ప్రాజెక్టులను అధ్యయనం చేసి వాటిలో ముఖ్యమైన వంద ప్రాజెక్టులను ప్రతి సంవత్సరం ఈ ఫోరం ముందుగా ఎంపిక చేస్తుంది. "స్ట్రాటజిక్ 100"గా పేర్కొనబడే ఈ వంద ప్రాజెక్టులను అవి ఏ విధంగా వాటి ప్రాంతాల, దేశాల ఆర్థికాభివృద్ధికి, ఉత్పాదకతకు, పోటీ పటిమకు, ఉద్యోగ అవకాశాలకు, ఇంధన సామర్థ్యానికి, కాలుష్య నివారణకు తోడ్పడతాయో నిశితంగా పరిశీలించి ఎంపిక చేస్తారు.

ఆ తరువాత మూడు రోజుల పాటు ఆయా ప్రాజెక్టుల సారథులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్లను ఈ సమావేశంలో ఇస్తారు. ఒక్కొక్క ప్రెజెంటేషన్ ఇచ్చే సమయం పది నిముషాలు. ఈ పది నిముషాలలో ప్రాజెక్టుకు సంబంధించిన, దేశానికి సంబంధించిన అనేక విషయాలను క్లుప్తంగా చెప్పగలగాలి. తరువాత ఐదు నిముషాలపాటు చర్చ ఉంటుంది. వివిధ దేశాల ప్రతినిధులు వేసే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి. ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఈ మూడు రోజులూ సమాంతరంగా ప్రజెంటేషన్లు ఉంటాయి. వీటి ఆధారంగా చివరకు 5 విభాగాలలో ప్రపంచపు అత్యుత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేస్తారు. ఈ సంవత్సరం ఈ విధమైన పోటీలో "ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ ఆఫ్ ది ఇయర్" అవార్డు కోసం అంతిమంగా మూడు ప్రాజెక్టులు పోటీ పడ్డాయి. 1. అజర్‌బైజాన్‌కు చెందిన ట్రాన్స్ అనటోలియన్ గ్యాస్ పైప్‌లైన్ (7 బిలియన్ డాలర్లు/37,800 కోట్ల రూపాయలు). 2. భారత్‌కు చెందిన హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు (2.66 బిలియన్ డాలర్లు/14,132 కోట్ల రూపాయలు). 3. కువైట్‌కు చెందిన అల్ అబ్దాలియా సోలార్ ప్లాంట్.

పైన వివరించిన వివిధ నిర్దేశిక సూత్రాల పైన, హైదరాబాద్ మెట్రో రైలు మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.వి.ఎస్.రెడ్డి చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పైన ఆధారపడి హైదరాబాద్ మెట్రో రైలును అంతిమంగా ఈ సంవత్సరపు ఉత్తమ ఇంజనీరింగ్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు.

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టును ప్రపంచంలోని ఇతర మెట్రో ప్రాజెక్టుల కంటే భిన్నంగా, ఉన్నతంగా ఎలా నిర్మిస్తున్నారనే విషయాన్ని ఆయన తన పవర్ పాయింట్ ప్రజెంటేషన్లో వివరించారు. ఈ ప్రాజెక్టును కేవలం ఒక రవాణా ప్రాజెక్టుగానే కాక నగర పునర్నిర్మాణ కార్యక్రమంగా (అర్బన్ రీడిజైన్) చేస్తున్నట్లు చెప్పారు. రైల్వే స్టేషన్లు, బస్ డిపోలు, లోకల్ రైళ్లతో మెట్రోను అనుసంధానం చేయడం, స్కైవాక్‌లు, ఫుట్‌పాత్‌లు, ఇతర పాదచారుల సౌకర్యాల కల్పన, మెట్రో స్టేషన్లో బైక్ స్టేషన్లు, స్టేషన్ నుండి సైకిల్ ట్రాక్‌ల ఏర్పాటు, ప్రజా ప్రయోజన స్థలాల ఏర్పాటు, ప్రజలకు నిత్యావసర వస్తువులు, షాపింగ్ వస్తువులు, ఆఫీసులు, రెస్టారెంట్లు, ఆరోగ్య సదుపాయాలు, అనేక ఇతర సౌకర్యాలు మెట్రో స్టేషన్ల దగ్గర ఏర్పాటు, రవాణా ఆధారిత అభివృద్ధి, హరిత మెట్రో స్టేషన్లు, ఇంధన వినియోగాన్ని తగ్గించడం, ఇంజనీరింగ్ ఆవిష్కరణల ద్వారా ప్రాజెక్టు ఖర్చు తగ్గించడం, మెట్రో ద్వారా హైదరాబాద్‌ను ఒక ప్రజా స్నేహిత, ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే ప్రణాళిక వంటి అనేక విషయాలను వివరించారు. అదే విధంగా ఈ క్రింది ప్రాజెక్టులు వాటి వాటి కేటగిరీలలో ఉత్తమ ప్రాజెక్టులుగా ఎంపికయ్యాయి.

**ఉత్తమ ఉద్యోగ కల్పన ప్రాజెక్టు :** కెనడాకు చెందిన డెట్రాయిట్ రివర్ ఇంటర్నేషనల్ క్రాసింగ్ ప్రాజెక్టు (3.5 బిలియన్ డాలర్లు/18,900 కోట్ల రూపాయలు).

**ఉత్తమ హరిత మౌలిక వసతుల ప్రాజెక్టు :** దక్షిణాఫ్రికాకు చెందిన రెన్యువబుల్ ఎనర్జీ ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్స్ ప్రాజెక్టు (5.4 బిలియన్ డాలర్లు/29,160 కోట్ల రూపాయలు).

**ఉత్తమ ఆర్థిక ప్రాజెక్టు :** బ్రెజిల్ కు చెందిన రియో డ జనీరియో ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు (3.2 బిలియన్ డాలర్లు/ 17,280 కోట్ల రూపాయలు).

**ఉత్తమ వ్యూహాత్మక ప్రాజెక్టు :** సంయుక్త అరబ్ దేశాల (యు.ఎ.ఇ)కు చెందిన ఇతిహాద్ రైల్ ప్రాజెక్టు (11 బిలియన్ డాలర్లు/59,400 కోట్ల రూపాయలు).

అవార్డుల ప్రదానం చాలా ఆసక్తికరంగా ఉంది. ఈ అవార్డులను మౌలిక వసతుల కల్పనా రంగపు ఆస్కార్ అవార్డులని చెబుతూ, తొలుత కొన్ని నిముషాల పాటు సస్పెన్సును పొడిగించారు. ఫోరం అధ్యక్షుడు నార్మల్ ఆండర్సన్. తర్వాత హైదరాబాద్ మెట్రో రైలు ఉత్తమ ఇంజనీరింగ్ ప్రాజెక్టుగా ఎన్నికైనట్లు ప్రకటించారు. హైదరాబాద్ మెట్రోరైలు మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఎన్.వి.ఎస్.రెడ్డి, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ బూసి శ్యాంబాబు, ముఖ్యమంత్రి కార్యదర్శి డా॥కె.ఎస్.జవహర్ రెడ్డి అవార్డును అందుకున్నారు. ఈ సమావేశానికి మౌలిక వసతుల కల్పన, నిర్మాణ రంగాల నిపుణులు, ప్రభుత్వ ప్రైవేటు రంగాల ఉన్నతాధికారులు, బ్యాంకర్లు, ఆర్థిక నిపుణులు, సలహాదారులు దాదాపు 400 మంది ప్రపంచ నలుమూలల నుండి హాజరయ్యారు. ముఖ్యంగా అరబ్ దేశాలలోను, లాటిన్ అమెరికా దేశాలలోను, ఈశాన్య ఆసియా దేశాలలోను నిర్మించబడుతున్న అనేక మౌలిక రంగ ప్రాజెక్టులపై ఎక్కువగా ప్రజెంటేషన్లు నిర్వహించారు. అవార్డులను ప్రదానం చేస్తూ... ఎకోనెక్స్ కంపెనీ ముఖ్య కార్యనిర్వాహకులైన లీ జాస్పర్ ఈ వార్షిక అవార్డులు ప్రాజెక్టుల రూప కల్పనలో, నిర్వహణలో చూపబడుతున్న ప్రతిభను, అత్యున్నత నాయకత్వ పటిమను గుర్తించాయని పేర్కొన్నారు. అవార్డును గెలుచుకున్న ప్రాజెక్టులు ఈ కాలపు అత్యున్నత కార్యనిర్వహణ విధానాలకు అద్దం పట్టడంతో పాటు అవి భవిష్యత్తును రూపుదిద్దే మార్గదర్శక ప్రాజెక్టులని సమావేశ అధ్యక్షుడు నార్మల్ ఆండర్సన్ అభివర్ణించారు. హైదరాబాద్ మెట్రోరైల్ రూపకల్పనలోను, నిర్మాణ ప్రక్రియలోను నవ్యతను, విశేష ప్రతిభను కనబరచి చక్కటి ప్రజెంటేషన్ చేసిన ఎన్.వి.ఎస్.రెడ్డిని వారు ప్రత్యేకంగా అభినందించారు. ◆